క్లుప్తంగా

రుషికొండకు భారీగా భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం గోవింద నామ స్మరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు తన్మయత్వం పొందారు. గోవిందా గోవిందా అంటూ ఏడుకొండల వాడిని స్మరిస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపల తిమ్మాపురం సమీపంలో జాతీయ విపత్తుల స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) కార్యాలయానికి దివీస్ సంస్థ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా రూ.1.35 లక్షల విలువ చేసే సిమెంట్ బెంచీలను శనివారం ఏర్పాటు చేసింది. వాటిని దివీస్ స్టేట్ ఆఫీసర్ ఎమ్.చంద్రరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఫోబిక్ ఫోకాన్ ప్రారంభించారు.

సచివాలయ కార్యదర్శికి అవార్డు



శివప్రసాద్‌కు అవార్డు అందజేసి సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మధురవాడ : నగరంపాలెం వార్డు సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న బండారు శివప్రసాద్‌కి న్యూ హోప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ విశాఖలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారియర్స్ ఆఫ్ ది ఇయర్ – 2023 అవార్డు ఇచ్చి సత్కరించింది. శివప్రసాద్ అత్యవసర సమయాల్లో దాతలు ద్వారా రక్తం అందించడం, అనాథాశ్రమాలు, ఓల్డ్ ఏజ్ హోమ్స్‌కి నిత్యావసర సరకులు అందించడం, కోవిడ్ ఫస్ట్ వేవ్‌లో 400 కుటుంబాలకు గ్రోసరీ అందించడం వంటి వాటితోపాటు బ్లైండ్ స్టూడెంట్స్‌కి అండగా నిలుస్తున్నారు. దీంతో ఈ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, డాక్టర్ మల్లేశ్వరి, కడప డిప్యూటీ మేయర్ త్యాగరాజు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న స్వామి

మధురవాడ: సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగిటకే అందించాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన దానికంటే సచివాలయ సిబ్బంది మరో అడుగు ముందుకు వేస్తున్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధి పీఎం పాలెం 51వ నంబరు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ కాకినాడ జిల్లా వెళ్లి ఓ లబ్ధిదారుకు పింఛన్ అందజేశారు. పీఎం పాలెంకి చెందిన వాడపల్లి సత్య మంగసుజాత అనే దివ్యాంగురాలు అనారోగ్యం కారణంగా కాకినాడ జిల్లా తురంగిలో తన అక్క ఇంటికి కొద్ది నెలల కిందట వెళ్లి అక్కడే ఉంటోంది. దీంతో సచివాలయం కార్యదర్శి కె.స్వామి శనివారం అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు.

అప్రమత్తతతో క్యాన్సర్‌కు ముకుతాడు



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు



చిట్టివలస హైస్కూల్‌లో అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న గ్రామీణ వైద్యులు

పీఎం పాలెం : ప్రపంచ మానవాళిని వణికిస్తున్న క్యాన్సర్‌కు అప్రమత్తతతో ముందు జాగ్రత్తలు తీసుకుంటే ముకుతాడు వేయవచ్చని ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ సుమన్ దాస్ అన్నారు. పీఎం పాలెంలోని బిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే తగిన చికిత్స తీసుకుని నయం చేసుకోవచ్చన్నారు. 40 ఏళ్లు దాటిన తర్వాత స్త్రీలు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ధూమపానం వల్ల గొంతు క్యాన్సర్ వచ్చే ముప్పు ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ గోవిందరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి

ఆనందపురం : ప్రాణాంతకమైన క్యాన్సర్ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్యామ్ సుందర్ సూచించారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వేములవలసలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. బీడీ, సిగరెట్, పాన్ పరాగ్, చుట్ట వంటి వాటివల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. గ్రామీణ వైద్యులు ఈ విషయమై ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ సందర్భంగా వేములవలస జాతీయ రహదారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.సుధాకర్ రెడ్డి, జె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావు, ప్రతినిధులు జి.రఘు, పి.వెంకటరమణ, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు స్వచ్ఛంద సంస్థల కృషి

తగరపువలస: క్యాన్సర్‌పై చిట్టివలస, తగరపువలసలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కలిగించారు. బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భీమిలి మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టడానికి స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవో సంఘాలు చేస్తున్న కృషిని వివరించారు. పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, గ్రామీణ వైద్యుల సంఘం కార్యదర్శి వెంపాడ అప్పలకారురెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, చిన్నారావు, మంగా శివప్రసాద్, డీవీఎస్ ప్రసాద్, గౌరీస్, కనకరాజు, మౌళి, అన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాలలో క్యాన్సర్‌పై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం జరుపుకుంటున్నట్టు వివరించారు. క్యాన్సర్ మరణాలు తగ్గించడమే లక్ష్యంగా యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో క్యాన్సర్‌పై వివరిస్తున్న ఉపాధ్యాయులు

యోగాచార్య రామారావు కృషి అమోఘం



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాసులు

భీమునిపట్నం: యోగా గొప్పదనాన్ని ఎంతగానో ప్రచారం చేయడంతోపాటు వందలాది మందికి శిక్షణ ఇచ్చిన యోగాచార్య రాపర్తి రామారావు కృషి ఎంతో గొప్పదని విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.శ్రీనివాసులు అన్నారు. ఇక్కడి యోగా కేంద్రంలో శనివారం నిర్వహించిన రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ అభ్యసించాలని, ఇది అందరికీ ఎంతో అవసరమన్నారు. దీనివల్ల ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. ఇంతటి గొప్ప శక్తి కలిగిన యోగా వ్యాప్తి చేయడానికి రామారావు ఎంతో శ్రమించారని, తద్వారా అనేక ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందారన్నారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో యోగాతో ప్రశాంత జీవనం గడపవచ్చన్నారు. ముఖ్యంగా ఇప్పటి వాతావరణం, ఆహార అలవాట్ల వల్ల ఎదుగుతున్న పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ఇది వారి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. దీన్ని ఎదుర్కోవాలంటే తప్పనిసరిగా యోగాలో శిక్షణ అందివ్వాలని సూచించారు. రాపర్తి రామారావు స్ఫూర్తితో ఏర్పాటైన భీమిలిలోని యోగా కేంద్రంలో అనేక మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు తగిన సేవలు అందిస్తుండడం చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం డాక్టర్ ఎస్.కె. మంజునాథ శర్మ మాట్లాడుతూ యోగాపై జరిగిన పరిశోధనలు, దానివల్ల కలిగే ప్రయోజనాలు, ప్రాణాంతక వ్యాధులు కూడా ఎలా నయమవుతున్నాయన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.భాస్కర్‌రెడ్డి, డాక్టర్ గణేష్‌రావు, టి.ఎల్.నర్సింహరావు పాల్గొన్నారు.

పద్మశాలీయుల సమస్యలపై వినతి



పద్మశాలీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ విజయలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న డైరెక్టర్ రామలక్ష్మణ

తగరపువలస: పద్మశాలీయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ కోరారు. ఈ మేరకు విజయవాడ బీసీ భవన్‌లో శనివారం జరిగిన పద్మశాలీ కార్పొరేషన్ సమావేశంలో చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు సడలించి 50 ఏళ్లు దాటిన చేనేతలకు సామాజిక పింఛన్లు మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో నేతన్న హస్తం పథకం మంజూరయ్యేలా చూడాలన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి నేతన్నలకు శిక్షణ ఇవ్వాలని కోరారు. సామాజిక భవనం, వృద్ధాశ్రమం, విద్యార్థులకు వసతి గృహం నిర్మించేందుకు నగర పరిధిలో ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. బీసీ కార్పొరేషన్ల పదవీ కాలం మరో రెండేళ్లు పెంచినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

అనంతుని కల్యాణోత్సవాలకు సహకరించాలి

- దేవస్థానం ఈవో నానాజీ బాబు



సమావేశంలో ఈవో నానాజీ బాబు, కమిటీ సభ్యులు, నాయకులు

పద్మనాభం: పద్మనాభంలో మార్చి 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న అనంతుని కల్యాణోత్సవాలు విజయవంతానికి అందరూ సహకరించాలని ఈవో ఎస్.నానాజీ బాబు కోరారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 2న పుట్ట బంగారం తీసుకొస్తామన్నారు. 3న అనంతుని కల్యాణం, 6న రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ కల్యాణోత్సవాల్లో భాగంగా గతంలో అనంతుని తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించేవారన్నారు. కొన్నేళ్లుగా నిర్వహించడం లేదని, ఈ ఏడాది తెప్పోత్సవాన్ని పునరుద్ధరించి, మార్చి 5న నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, మరగడ అప్పారావు, మొకర అప్పలనాయుడు, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న రోడ్డు రక్షణ గట్టు

ఆందోళనలో వాహన చోదకులు



కోతకు గురై జారిపోతున్న రాళ్లు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్ నుంచి పతివాడవారి కళ్లాలు మీదుగా ఐఎంఎఫ్ఎల్ డిపో వరకూ ఉన్న రోడ్డు రక్షణ గట్టు రోజురోజుకూ కోతకు గురవుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ సర్వీసు రోడ్డు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆనందపురం జంక్షన్ నుంచి బంటుబిల్లి వారి కళ్లాలు, ఆనందపురం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆరు లైన్లు రహదారిని చేరుకోవాలంటే ఇదొక్కటే మార్గం. కాగా మొదట ఆరు లైన్ల రహదారి నిర్మాణ సమయంలో సర్వీసు రోడ్డుని ఏర్పాటు చేయక పోవడంతో ఆవల వైపు గల సుమారు వంద ఇళ్లకు వేములవలసతో సంబంధం తెగిపోవడంతోపాటు, ఆర లైన్ల రహదారిని చేరుకోవడానికి ఏ మార్గమూ లేకుండా పోయింది. దీంతో గ్రామస్తులు పలుమార్లు ఆందోళనకు దిగడంతో సర్వీసు రోడ్డుతోపాటు అండర్ పాత్‌ను కూడా ఏర్పాటు చేశారు. అంత వరకూ బాగానే ఉన్నా కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈ రోడ్డు గుండా ప్రయాణం ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. సర్వీసు రోడ్డుకి ఆరు లైన్ల రహదారి సుమారు 25 అడుగుల ఎత్తులో చాలా ఏటవాలుగా ఉంది. దీంతో రక్షణ గోడ నిర్మించాల్సి ఉన్నప్పటికీ గట్టుని ఏర్పాటు చేసి మట్టి, కంకరతో నింపి వదిలేశారు. దీంతో అసలే ఏటవాలు... ఆపైన మట్టి కావడంతో ఏమాత్రం వర్షం కురిసినా కోతకు గురై రాళ్లు సర్వీసు రోడ్డుపైకి కొట్టుకొస్తున్నాయి. దీంతో గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గం గుండానే ఐఎంఎఫ్ఎల్ గొడౌన్‌కు వచ్చే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు ఎత్తుగా ఉన్న ప్రాంతాల్లో, పక్కన రోడ్డు ఉన్న సందర్భాల్లో అక్కడ ఏర్పాటు చేసే రక్షణ గట్టులు గానీ, రక్షణ గోడలు కానీ కోతకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాంటి చర్యలు ఏవీ తీసుకోకపోవడం వల్ల రక్షణ గట్టు చాలా వరకు జారిపోయి కిందకు కొట్టుకొచ్చింది. వర్షాలు కురిసే సమయంలో మట్టి అంతా కిందకు కొట్టుకొచ్చి సర్వీసు రోడ్డుపై పేరుకుపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఒడిశా పిల్లల భవిష్యత్‌కు బాటలు వేద్దాం

- వారిని ప్రత్యామ్నాయ పాఠశాలకు పంపించాలి
- ఇటుక బట్టీల యజమానులతో డీఈవో చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పద్మనాభం: ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఒడిశా కార్మికులకు చెందిన బడి ఈడు పిల్లలకు చదువు నేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేద్దామని జిల్లా విద్యా శాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఇటుక బట్టీల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న మూడు వందల ఇటుక బట్టీల్లో ఉపాధి కోసం ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు పని చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వారి పిల్లలకు మన ప్రాంతంలో ఉన్నంత కాలం ఒడియా భాషలో చదువు నేర్పించాల్సిన బాధ్యత ఇటుక బట్టీల యజమానులపై ఉందన్నారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. బట్టీల్లో పని చేస్తున్న ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికుల పిల్లలు ఎందరున్నారో వలంటీర్లతో తక్షణమే సర్వే చేయించి పేర్లు ఇవ్వాలని ఆదేశించారు.

ఒడిశా పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించి ప్రత్యామ్నాయ పాఠశాలలకు పంపించే బాధ్యత ఇటుక బట్టీల యజమానులు తీసుకోవాలన్నారు. వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటుపై అక్షయపాత్ర ఫౌండేషన్‌తో మాట్లాడుతానన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పాఠశాలకు వచ్చే ఒడిశా విద్యార్థులకు తమ శాఖ పరంగా యూనిఫాం ఇస్తామని తెలిపారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పాఠశాల షెడ్‌కు అవసరమయ్యే మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, డీవైఈవో గౌరీశంకర్, ఎంఈవో ఎం.శివరాణి, ప్రత్యామ్నాయ పాఠశాల కో – ఆర్డినేటర్ శైలజ, జిల్లా విద్యా శిక్షణ సంస్థ అధ్యాపకుడు జి.రవి పాల్గొన్నారు.

రోగికి, వైద్యునికి మధ్య వారధి ఫార్మసీ వృత్తి



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తగరపువలస: ఫార్మసీ వృత్తి రోగికి, వైద్యునికి మధ్య వారధి వంటిదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాలలో శనివారం ఫార్మా విద్యార్థుల ఇండక్షన్ మీట్, ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో స్వాగతం పలికి ప్రోత్సహించడమే ఈ వేడుకల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం ఫార్మసీ వృత్తిలోని వివిధ కోణాలు, సవాళ్లను వివరించారు. అరబిందో ఫార్మా క్లస్టర్ హెడ్ ఒంగోలు శేషసాయి మాట్లాడుతూ ఫార్మసీలో ఇండస్ట్రీ కనెక్ట్ సపోర్ట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, విద్యార్థుల అకడమిక్ టెక్నికల్ యాక్టివిటీస్‌లో చొరవ, బ్రిడ్జ్ కోర్సులు, వాల్యూ యాడెడ్ కోర్సులను వివరించారు. ఏయూ ఫార్మసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ రంగంలో అందుబాటులో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంటీవీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమాశంకర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటికే ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మధురవాడలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

మధురవాడ: వివక్ష చూపకుండా రాష్ట్రంలోని లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని కొమ్మాది జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ వైఎస్సార్ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, బ్లాకుల మధ్య అంతర్గత రోడ్లు, కమ్యూనిటీ హాలు నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సచివాలయం పరిధిలోనే 850 గృహాల్లో 1,424 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా రూ.5.91కోట్లు అందించామని చెప్పారు.

ప్రభుత్వ పింఛనే కుటుంబానికి ఆసరా

తమ కుటుంబాన్ని ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ డబ్బులే నిలబెడుతున్నాయని కాలనీలోని టైప్ – 2 సమీప 15వ బ్లాక్‌లో ఉంటున్న నాగయ్యమ్మ ఎమ్మెల్యేకు చెప్పారు. గతంలో కాలు విరిగిపోతే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్య శ్రీ ద్వారా శస్త్రచికిత్స చేయించి మళ్లీ నడిపించారని... ఇంతలో చర్మ వ్యాధికి గురవడంతో ఎవరూ పనిలో పెట్టుకోకపోవడంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న పింఛను నగదు తమ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోందని నాగయ్యమ్మ ఉద్వేగానికి గురై కంటతడి పెట్టారు. ఇలా పలువురు తమకు ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును చెబుతూ మళ్లీ జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏసీపీ సీహెచ్ రఘునాథరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, ఇన్‌చార్జి పోతిన సురేష్, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వివిధ విభాగాల నాయకులు బండారు శివలక్ష్మి, వంకర అప్పారావు, దేవ, కొండమ్మ, రాధ, అప్పలరాజు, రజని, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు ఢీకొని పలువురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

ఆనందపురం : మండలంలోని వేములవలసలో ఉన్న ఐఎంఎఫ్ఎల్ డిపోకు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తగరపువలస వైపు నుంచి ఆనందపురం వస్తున్న లారీని డ్రైవర్ హఠాత్తుగా నిలిపాడు. దీంతో దాని వెనుక వస్తున్న బొలేరా వాహనం దాన్ని ఢీకొట్టింది. ఈ క్రమంలో బొలేరా వాహనం వెనుక వస్తున్న మరో లారీ బొలేరాను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో దాంట్లో ఉన్న డ్రైవర్ తగరపువలస బంగ్లామెట్టకు చెందిన వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే బొలేరా వాహనంలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స కోసం అత్యవసర వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బొలేరా వాహనంలో గాయపడిన వారి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ డీలర్ మృతి

కొమ్మాది: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ రేషన్ డిపో డీలర్ మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలసలో నివసిస్తూ రేషన్ డిపో నడుపుతున్న సారిక దామోదర్ (39) గత నెల 31న సాయంత్రం తగరపువలస వెళ్లారు. అదే రోజు రాత్రి భీమిలి బ్యాంక్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కన రక్తం మడుగులో పడిపోయి ఉన్నారు. ఆయన వస్తున్న ద్విచక్ర వాహనం మరోవైపు పడిపోయి ఉంది. గమనించిన స్థానికులు తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య కుమారి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వం.. లలితాకామేశ్వరుల గ్రామోత్సవం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ వార్షిక బ్రహోత్సవాలు పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రెండు వారాలుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం లలితాకామేశ్వరుల గ్రామోత్సవం పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చూడముచ్చటగా అలంకరించి పల్లకీపై భక్తులు ఊరేగించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని ప్రత్యేక రథంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పర్యవేక్షణలో మహిళలు పెద్ద సంఖ్యలో రథయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల నీరాజనాలు

లలితానగర్‌లోని లలిత గుడి వద్ద ప్రారంభమైన ఊరేగింపు శంకరమఠం రోడ్, డైమండ్ పార్కు, దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. విద్యుత్ దీపాలు, అలంకరణ, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపులో భక్తులు వేలాదిగా వెంట రాగా, అమ్మవారికి అడుగడుగునా భక్తులు హారతులిచ్చి, టెంకాయలు కొట్టి నీరాజనాలు పలికారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు పీఠంలో కాళీ కాలభైరవుల ప్రతిష్ఠ, విశేష పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణంతో బ్రహోత్సవాలు ముగుస్తాయని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమంలో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్ శర్మ, సీఈవో మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.